దళిత బంధు కొందరికే..!

- ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎంపికపై ఎమ్మెల్యేల వెనుకడుగు
- మేడ్చల్ జిల్లాలో దళిత బంధు లక్ష్యం 5,500
- ఎంపిక చేసింది 1200 మంది లబ్ధిదారులను మాత్రమే..

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో దళితబంధు పథకం కింద లబ్ధిదారుల ఎంపిక కత్తి మీద సామవుతోంది. మొదటి దశలో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి వంద మంది చొప్పున జిల్లా పరిధిలోని ఐదు నియోజకవర్గాల్లో మొత్తంగా 500 మంది లబ్ధిదారులకు దళిత బంధు అందజేశారు. అయితే రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి 1100 మందికి చొప్పున జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 5,500 మందికి ఈ



పథకం లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

లబ్ధిదారుల ఎంపిక ఇలా..

లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి రూరల్‌లో మండలాలు, పురపాలక సంఘాల్లో డివిజన్లు/వార్డుల వారీగా ఎస్సీ జనాభా, కుటుంబాల సంఖ్య తదితర వివరాలను సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా సేకరించారు. రెండో విడత దళిత బంధు పథకం అమలుకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక జీవోను జారీ చేసింది. ఒక్కో దళిత కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఆర్థికసాయం అందజేసి, వారి ఉన్నతికి తోడ్పడటమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. మొదటి విడతలో లబ్ధిదారులను ఎమ్మెల్యేలు ప్రతిపాదించగా ఇన్‌చార్జి మంత్రి ఆమోదించారు. దీంతో ఎంపిక పూర్తిగా ఏకపక్షంగా జరిగిందనే విమర్శలు వెల్లివెత్తాయి. దీంతో ప్రభుత్వం రెండో విడత ఎంపికకు ప్రత్యేకంగా మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రజా ప్రతినిధుల సమన్వయంతో కలెక్టర్లు లబ్ధిదారులను ఎంపిక చేయాలని మౌఖికంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా.. లబ్ధిదారుల ఎంపిక మాత్రం ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే సాగుతోంది.

అక్రమాలు అరికడితేనే..

జిల్లాలో మొదటి విడత దళిత బంధులో ఎంపికైన లబ్ధిదారుల్లో కొందరు యూనిట్లు విక్రయించుకున్నారనే ఆరోపణలున్నాయి. మరికొందరు యూనిట్లు స్థాపించుకుని ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగుతున్నారు. కొందరు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు దళారులుగా వ్యవహరించి లబ్ధిదారుల నుంచి యూనిట్లను కాజేసినట్లు విమర్శలు ఉన్నాయి. మెజార్టీ లబ్ధిదారులు వాహనాల కొనుగోలుకే మొగ్గు చూపారు. దీంతో ఉపాధి కొరవడి వాటిని నిర్వహించే ఆర్థిక స్తోమత లేక తక్కువ ధరకే విక్రయించుకున్నారు. రెండో విడత దళిత బంధులో గతంలో జరిగిన తప్పిదాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగం భావించినా సాధ్యం కాని పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది.

దళిత బంధు కొందరికే..

రెండో విడత దళిత బంధు పథకంలో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో 1100 చొప్పున 5 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 5,500 మందికి దళిత బంధు పథకాన్ని వర్తింపజేయాల్సి ఉంది. అయితే.. ఇప్పటి వరకు జిల్లాలో దళిత బంధు కోసం 1200 మంది లబ్ధిదారులను మాత్రమే ఎంపిక చేసినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. మంత్రి మల్లారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 200 మంది జాబితాను ఖరారు చేశారు. దళితబంధు పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేయకపోవడానికి ప్రధానం కారణం స్థానిక ఎమ్మెల్యేలు ప్రత్యేక శ్రద్ధ కనబర్చకపోవడమేనని తెలుస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో.. ఈ కొద్దిపాటి యూనిట్లతో దళితులందర్నీ సంతృప్తి పరచడం కష్టమని భావిస్తున్న ప్రజాప్రతినిధులు.. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు కాలయాపన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. జిల్లాలోని నిరుపేద దళిత కుటుంబాల వారు మాత్రం దళిత బంధు పథకం కోసం ఎదురు చూస్తున్నారు.

క్లుప్తంగా...

నేడు స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ

కీసర: స్వచ్ఛతా హీసేవా కార్యక్రమంలో భాగంగా శనివారం నాగారం జిల్లా పరిషత్ స్కూల్ నుంచి ర్యాలీ నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ర్యాలీలో మున్సిపల్ పాలకవర్గం సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొనాలన్నారు. ఆదివారం ఉదయం మున్సిపల్ పరిధిలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి క్లీనింగ్ డ్రైవ్ చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, ప్రజలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా కాలనీల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



బాలాజీనగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ దీపికరెడ్డి

మేడ్చల్: పట్టణంలోని బాలాజీనగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి కౌన్సిలర్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కాలనీలో రూ.30 లక్షలతో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులకు ఆమె పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులు ప్రారంభించారు.

మూడవ వార్డులో..

అత్వెల్లి పరిధిలోని మూడో వార్డు సీసీ రోడ్డు నిర్మాణ పనులను కౌన్సిలర్ ప్రారంభించారు. వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

రాహుల్ గాంధీని కలిసిన నక్క ప్రభాకర్‌గౌడ్



మేడ్చల్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని మేడ్చల్ నియోజకవర్గ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్ కలిశారు. గురువారం ఆయన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. రాహుల్ గాంధీని ఢిల్లీలోని ఆయన నివాసంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డితో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు.

వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్‌కు నివాళి



అవుషాపూర్‌లో స్వామినాథన్‌కు నివాళులర్పిస్తున్న రైతులు

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో హరిత విప్లవ పితామహుడు, భారత వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్‌కు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్ పోచిరెడ్డి, విశ్రాంత శాస్త్రవేత్త హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతులు మశ్చేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, మల్లేశ్, లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, నరసింహ, సాయిలు, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల సముదాయాన్ని పరిశీలించిన చైర్మన్



రాంపల్లిలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయాలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లిలో ప్రభుత్వం పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు నిర్మించిన డబుల్ బెడ్‌రూం గృహ సముదాయాలను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కమిషనర్ రాజేంద్ర కుమార్, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంపల్లి రెవెన్యూ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను త్వరలో లబ్ధిదారులకు పంపిణీ చేయనున్న నేపథ్యంలో గృహ సముదాయాలను పరిశీలించినట్లు చెప్పారు. కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి



బీజేఆర్‌నగర్‌లో భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పల్లపు రవి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 6వ డివిజన్ బీజేఆర్‌నగర్‌లో రూ.5 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో భూగర్భ డ్రైనేజీ పనులను శుక్రవారం కార్పొరేటర్ పల్లపు రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, మంత్రి చామకూర మల్లారెడ్డి సహకారంతో డివిజన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించి సమస్యలు లేని డివిజన్‌గా మారుస్తున్నట్లు చెప్పారు. డివిజన్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ పల్లపు ఉపేంద్ర, నాయకులు ప్రశాంత్, కళావతి, రవీందర్‌గౌడ్, చంద్రమోహన్‌చారి, మురళీ, బలరాం, కనకరాజు, జాంగీర్, గంగాధర్‌రెడ్డి, సత్తమ్మ, జచమ్మ, హేమలత, కాలనీవాసులు పాల్గొన్నారు.

22 కాలనీల అవస్థలు పట్టవా..?

- మున్సిపల్ కార్యాలయం వద్ద జేఏసీ ధర్నా
- కమిషనర్ రాజేంద్రకుమార్‌కు వినతి



కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని సుమారు 22 కాలనీవాసులు ఎదుర్కొంటున్న వరద నీరు, మురుగునీటి సమస్యకు ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు, పాలకులు శాశ్వత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం 22 కాలనీల ప్రజలు జేఏసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు జయకుమార్, రవీందర్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ కొన్నేళ్లుగా వర్షాకాలం వచ్చిందంటే నాగారంలోని లోతట్టు కాలనీవాసులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. వర్షాలు కురిసి వరద, మురుగు నీరు కాలనీలను ముంచెత్తుతోందని, ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఉందన్నారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు, దమ్మాయిగూడ మున్సిపాలిటీ తదితర ప్రాంతాల నుంచి మురుగు నాగారం మున్సిపల్ పరిధిలోకి వచ్చిచేరుతోందన్నారు. మురుగు నీటితో దుర్గంధం వెదజల్లుతోందని, కాలనీల్లో నివసిస్తున్న ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఉందన్నారు. నాగారం ప్రధాన రహదారి మీదుగా పెద్దకప్పు వరకు నాలా నిర్మించాలని 22 కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు, కొందరు తమ స్వార్థం కోసం కాలనీల మధ్య నుంచి నాలాను నిర్మించాలని చూస్తున్నారని మండిపడ్డారు. కాలనీవాసులంతా కలిసి సమస్యపై పోరాటం చేసేందుకు జేఏసీగా ఏర్పడి పోరాటం చేస్తున్నామన్నారు. అనంతరం కమిషనర్ రాజేంద్రకుమార్‌కు కలిసి వినతిపత్రం అందజేసి తమ కాలనీల్లో పర్యటించాలని కోరారు. జేఏసీ నేతలు జైకుమార్, కాలనీల నేతలు తదితరులు పాల్గొన్నారు.

చెత్తతో ఎరువు ఎలా తయారు చేస్తారో తెలుసా..?



చెత్తతో ఎరువు తయారు చేసే విధానాన్ని విద్యార్థులకు వివరిస్తున్న అధికారులు

మేడ్చల్: ఇళ్ల నుంచి వెలువడే చెత్తతో ఎరువులు తయారు చేసే విధానంపై అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అధికారులు మేడ్చల్‌లోని డీఆర్‌సీసీ, ఎఫ్ఎస్‌టీపీ సెంటర్లకు విద్యార్థులను తీసుకెళ్లి తడిపొడి చెత్తను వేరు చేసే విధానం, వాటితో ఎరువులు తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శివకుమార్‌యాదవ్, కమిషనర్ త్రిలేశ్వర్ రావు, ఆర్‌ఓ రాంచందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఎన్విరాన్‌మెంట్ ఏఈ జ్ఞానేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

3న మేడ్చల్ జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక

ఘట్‌కేసర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తూముకుంట మున్సిపాలిటీలోని స్పోర్ట్స్ స్కూల్‌లో వచ్చేనెల 3న అండర్–14, 17 బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు, ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల నిర్వాహణ కార్యదర్శి వినోద్‌కుమార్ తెలిపారు. పోటీలో పాల్గొనే అండర్–14, అండర్–17 బాలబాలికలు ఉదయం 7 గంటలలోపు చేరుకోవాలన్నారు. క్రీడాకారుల అర్హత ఫామ్‌లో ఫొటో, బోనాఫైడ్, ఆధార్ కార్డు, గతేడాది ప్రోగ్రెస్ కార్డు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని, సర్టిఫికేట్లపై హెచ్‌ఎం సంతకం, స్టాంప్ తప్పనిసరి ఉండాలన్నారు. వివరాలకు ఫోన్: 98497 30980.

పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలి



కమిషనర్ త్రిలేశ్వర్‌రావు

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలో ఆదివారం నిర్వహించే ఏక్ తారీఖ్.. ఏక్ గంట.. ఏక్ సాత్ కార్యక్రమంలో పట్టణ ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులోని విద్యాలయాలు, ప్రార్థన మందిరాలు, రైల్వే స్టేషన్, బస్టాండ్, మార్కెట్‌లలో ప్రజాప్రతినిధులు ప్రజలతో కలిసి గంట పాటు పాల్గొని పరిసరాలను శుభ్రం చేయాలని కోరారు. పట్టణ వాసులు స్వచ్ఛ మేడ్చల్‌లో కోసం కృషి చేయాలని కోరారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ దీపికరెడ్డి

మేడ్చల్: పట్టణంలోని కిష్టాపూర్‌లో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి కౌన్సిలర్ తుడుం గణేష్‌తో కలిసి ప్రారంభించారు. పూజా కార్యక్రమాలు నిర్వహించి డ్రైనేజీ పనులను ఆమె ప్రారంభించారు. కిష్టాపూర్ అభివృద్ధికి పూర్తి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.

ప్రజల నిధులు.. బీఆర్ఎస్ శ్రేణులకు..



ప్రవీణ్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు

ఘట్‌కేసర్: దళితబంధు, గృహలక్ష్మి పథకం బీఆర్ఎస్ కార్యకర్తలకే అందజేస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు చలువాదీ ప్రవీణ్‌రావు విమర్శించారు. అంకుషాపూర్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో గృహలక్ష్మి మంజూరు పత్రాలు బీఆర్ఎస్ నాయకులు, అనుచరులకు అందజేస్తున్నారని అన్నారు. ప్రజలకు చెందాల్సిన నిధులను బీఆర్ఎస్ ప్రభుత్వం పార్టీ శ్రేణులకు పంచుతోందని అన్నారు. పారదర్శక పాలన బీజేపీతోనే సాధ్యమన్నారు.

అభ్యర్థుల వ్యయంపై అధికారులకు శిక్షణ

ప్రారంభించిన జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి నియమావళిపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. శాసనసభ ఎన్నికలు–2023 అభ్యర్థుల వ్యయంపై శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులకు ప్రారంభించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయం, వెనుకబడిన తరగతుల సంక్షేమ జిల్లా అధికారి కేశురామ్, రాష్ట్రస్థాయి మాస్టర్ ట్రైనర్, డీసీవో శ్రీనివాసమూర్తి, జిల్లా ట్రెజరీ అధికారి నర్సింహారావు పలు విషయాలపై సంబంధిత ఎన్నికల అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమంలో మేడ్చల్, ఉప్పల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఎన్నికల వ్యయానికి సంబంధించి మానిటరింగ్ చేయడం, ఈవీఎంలు, పోలింగ్ కేంద్రాలు, చట్టపరమైన నిబంధనలు, ఫిర్యాదులు తదితర వివరాలతో కూడిన సమాచారాన్ని శిక్షణ కార్యక్రమంలో పేర్కొన్నారు. జిల్లాలో శాసనసభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాల్సిన బాధ్యత కూడా ఎన్నికల అధికారులపై ఉంటుందని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్టీ, వీఎస్టీ, వీవీటీ, అకౌంటింగ్ బృందం, ఎక్సైజ్ బృందం పాల్గొంది.

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి



మేడ్చల్‌లో మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె



ఘట్‌కేసర్‌లో కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న సబిత

మేడ్చల్: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, పెంచిన వేతనాలను వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఉన్ని కృష్ణ డిమాండ్ చేశారు. మేడ్చల్‌లో నిర్వహించిన మధ్యాహ్న కార్మికుల సమ్మెలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పేద పిల్లలకు పాఠశాలలో నిత్యం భోజనం వండి పెడుతున్న కార్మికులకు ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో వారు అప్పుల పాలవుతున్నారని అన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలు, యూనిఫామ్స్ అందజేయాలని, రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రేమలత, విజయలక్ష్మీ, భాగ్య, మంగ, లత తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

ఘట్‌కేసర్: పెండింగ్ వేతనాలు, ఏరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు స్థానిక మండల విద్యాధికారి కార్యాలయం ఎదుట శుక్రవారం నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యురాలు సబిత సంఘీభావం తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పుష్ప, శ్రీను, ప్రేమలత, కల్యాణి, పద్మ, శివరాణి, అనుసూయ, జ్యోతి, నర్సమ్మ, యాదమ్మ, భాగ్య, అనురాధ పాల్గొన్నారు.

ఔషధ రంగంలో విద్యార్థులకు అపార అవకాశాలు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథి పద్మజ, డైరెక్టర్ సీవీ కృష్ణారెడ్డి

ఘట్‌కేసర్: ఔషధ రంగంలో విద్యార్థులకు అపార అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ సురక్ష ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ పద్మజ మన్నెపల్లి అన్నారు. చౌదరిగూడ నల్లా నరసింహారెడ్డి ఫార్మా కళాశాలలో మొదటి సంవత్సరం ఫార్మసీ విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఔషధ రంగంలో పరిశోధనలు, నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. కళాశాల డైరెక్టర్ సీవీ కృష్ణారావు ఫార్మా రంగం ప్రాముఖ్యత, ఆ రంగంలోని అవకాశాలను వివరించారు. అనంతరం ఫార్మసీ కళాశాల సావనీర్‌ను ఆవిష్కరించారు. ఫార్మా డీన్ కృష్ణమోహన్, ఎంబీఏ డీన్ రవీంద్రరెడ్డి, టీపీఓ శ్రీకాంత్, ఫార్మసీ విద్యార్థులు, అధ్యాపకులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని భిక్షాటన



ఘట్‌కేసర్‌లో భిక్షాటన చేస్తున్న యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుచిత్ర, టీచర్లు

ఘట్‌కేసర్: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుచిత్ర ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారంతో 19 రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా భిక్షాటన చేసి నిరసన చేపట్టారు. అనంతరం జిల్లా అధ్యక్షురాలు సుచిత్ర మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం అందజేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. విశాలి, పద్మ, కవిత, హైమావతి, భాగ్య, శారద, రజనీ, సుభద్ర, వెంకటలక్ష్మీ, మంగ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ వాళ్లకేనా సంక్షేమ పథకాలు?

ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: సంక్షేమ పథకాల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల స్థితిగతులను పరిశీలించకుండా దళితబంధు, గృహలక్ష్మి పథకాలను బీఆర్ఎస్ కార్యకర్తలు, అనుచరులకు అందజేస్తున్నారని విమర్శించారు. నిధులు కేటాయించకుండా ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రకటిస్తూ పేదలను మోసం చేస్తున్నారన్నారు. నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందజేయాలని కోరారు.

అంతా కలిస్తేనే స్వచ్ఛత సాధ్యం

మేడ్చల్: స్వచ్ఛత హీ సేవా.. స్వచ్ఛత లీగ్ ఐఎస్ఎల్ 2.0 కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని 23, 18 వార్డుల్లో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పలువురు అన్నారు. స్వచ్ఛత కోసం విద్యార్థులచేత అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. రోడ్లపై ముగ్గులు వేసి వేసి అవగాహన కల్పించారు. వీధులను చీపుర్లతో శుభ్రం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొడే మహేష్, భవాని రాఘవేందర్‌గౌడ్, ఎన్విరాన్‌మెంట్ ఏఈ జ్ఞానేశ్వర్, ఆర్‌ఓ రాంచందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ఆర్‌పీలు పాల్గొన్నారు.



మేడ్చల్‌లో వీధులను శుభ్రం చేస్తున్న నేతలు, మున్సిపల్ సిబ్బంది